విరబూసి.. ధరల దోబూచి



- పడిపోయిన పూలధరలు
- విక్రయాలు లేక బోసిపోయిన మార్కెట్
- ఇబ్బందులో రైతులు

అమరాపురం: పూల ధరలు తగ్గి పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత కార్తీక మాసం నుంచి ధనుర్మాసం వరకు కొద్దిగా పూలకు ధరలున్నా ప్రస్తుతం వచ్చిన పుష్యం మాసంతో ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. దీంతో పూలు కొనుగోలుదారులు లేక అమరాపురం పూల మార్కెట్లో విక్రయాలు లేక బోసి పోయింది. అలాగే పూల తోటలను గుత్తకు తీసుకుని పూలు కోసి హారాలు తయారు చేసే వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పూలు కోయక పోతే అవి రాలిపోతాయని, కోయడానికి కూలి వారిని తీసుకెళ్తే కూలి డబ్బులు తమ చేతి నుంచి చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



అమరాపురం మండలంలో సాగు చేసిన పూల తోట

మండలంలోని వలస, విరుపసముద్రం, తమ్మడేపల్లి, నగోనపల్లి, దేవగానపల్లి, గౌడనకుంట, ఉదుగూరు, చిట్నడకు, హలుకూరు అమరాపురం తదితర గ్రామాల్లో రైతులు కాకడ, కాగడ, కనకాంబరం, మల్లె, బంతి, చామంతి తదితర పూలను సాగు చేశారు. గతంలో బాగా ధరలు పలకడంతో రైతులు వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా బోరు బావుల కింద సాగు చేశారు. అయితే ప్రస్తుతం ధరలు లేక పోవడంతో పెట్టుబడి రావడం లేదని వారు వాపోతున్నారు. పూలు కోయడానికి కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా అనుసంధానం చేస్తే అటు రైతులు, ఇటు కూలీలు, వ్యాపారులకు నష్టం లేకుండా వుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

అమరాపురంలో కొనుగోలుదారులు లేక బోసిపోతున్న పూల మార్కెట్

పూల రకం	నవంబర్‌లో ధర (రూపాయల్లో)	ప్రస్తుత ధర (రూపాయల్లో)
కాగడ	150	60
కాకడ	160	50
కనకాంబరం	150	70
మల్లె	180	80
చామంతి	120	40
బంతి	60	20

ఉపాధి పథకంతో అనుసంధానం చేయాలి



పూల తోటలు సాగు చేసే రైతులకు మేలు చేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకంలో అనుసందానం చేయాలి. దీంతో నష్టాలు రాకుండా నివారించుకోవచ్చు. ప్రస్తుతం ధరలు లేక పోవడంతో చాలా నష్ట పోతున్నాం. కూలీలకు చేతి నుంచి డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. దీనికి తోడు రవాణా ఖర్చులు వస్తాయి. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మంజునాథ, రైతు, విరుపసముద్రం

ధర లేక నష్టపోతున్నాం..



గత నవంబర్ నుంచి డిశంబర్ మూడో వారం వరకూ అర కొరగా పూల అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం పుష్య మాసం రావడంతో పూలను అడిగేవారే లేరు. మేం కొనుగోలు చేసి ఇలా మార్కెట్లో ఉదయం నుంచి సాయంకాలం వరకు కూర్చొన్నా కూలి కూడా రావడం లేదు. దీంతో చాలా నష్ట పోతున్నాం. ప్రభుత్వం పూల అమ్మకందారులకు వడ్డీ లేని రుణాలివ్వాలి.

– నాగరాజు, చిరు వ్యాపారి, అమరాపురం

క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఎంతో సమావేశమైన ఎన్‌ఎంయూ నాయకులు

మడకశిర: ఆర్టీసీ కార్మికులు, డిపో సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎన్‌ఎంయూ నాయకులు డీఎం రామసుబ్బయ్యను కోరారు. గురువారం ఎన్‌ఎంయూ నాయకులు డీఎంతో సమావేశమై సమస్యలపై చర్చించారు. రెగ్యులర్ బస్సులను విద్యార్థుల కోసం నడపకుండా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఎన్‌ఎంయూ నాయకులు కోరారు. మూడు మస్టర్లు ఇవ్వకుండా రెండు మస్టర్లే ఇస్తే అలాంటి సర్వీసులు మడకశిర డిపోకు వద్దని ఎన్‌ఎంయూ నాయకులు డీఎంను కోరారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని డీఎం హామీ ఇచ్చినట్లు ఎన్‌ఎంయూ నాయకులు తెలిపారు. ఎన్‌ఎంయూ నాయకులు సుబ్బరాయుడు, రామక్రిష్ణ, ముద్దప్ప,పురుషోత్తం, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ధనాపురం విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని గ్రీష్మ, గైడ్ టీచర్ సుకన్యను అభినందిస్తున్న హెచ్‌ఎం జ్యోతిర్మయి

పరిగి: మండలంలోని ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గ్రీష్మ ఉత్తమ ప్రతిభను కనపరిచి అవార్డుతో పాటు నగదు బహుమతి సాధించింది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలలో ధనాపురం జెడ్పీ స్కూల్ విద్యార్థిని ఉత్తమ ప్రతిభను కనపరిచింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందుకున్నట్లు హెచ్‌ఎం జ్యోతిర్మయి తెలిపారు. గురువారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీష్మతో పాటు గైడ్ టీచర్ సుకన్యను హెచ్‌ఎం జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

హిందూపురం టౌన్: విధుల్లో నిర్లక్ష్యం తగదని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజువాణి వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని లక్ష్మీపురంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బసవనపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పరిసరాల పరిశుభ్రత, కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. గర్భవతుల ఆర్‌సీహెచ్ ఐడీలతో అభా ఐడీలతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. టీకాల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. అన్ని పారామీటర్స్ వంద శాతం ఉండాల్సిందే అని సూచించారు. అలాగే యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలతో రోగులకు వైద్య పరీక్షలు చేయడంలో, మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ మంజుశ్రీతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



మట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి: విద్యార్థులు క్రమశిక్షణతో చదవి తలిదండ్రుల కలలు సాకారం చేయాలని, మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో తల్లిదండ్రులతో సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తలిదండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని కష్టపడి ఇష్టంగా చదవలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎంఈఓలు భాస్కర్, చంద్రశేఖర్‌నాయుడు , జెడ్పీటీసీ ఉమేష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు తగవు

సోమందేపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు తగవని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య తెలిపారు. వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు జీ.కె. ప్రకాష్, సీపీఎం నాయకులు రంగప్ప, నారాయణ స్వామి, కిష్టప్ప నాగభూషణ, రవి పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో రోడ్డు నిర్మాణానికి మార్కింగ్



వైఎస్సార్‌సీపీ నాయకుల స్థలంలో రోడ్డు వేయడానికి జేసీబీతో ముళ్ల చెట్లను తొలగిస్తున్న అధికారులు

పెనుకొండ: పట్టణంలో వివాదాస్పద స్థలంలో పోలీసుల సమక్షంలో రెవెన్యూ సిబ్బంది గురువారం మార్కింగ్ ఇచ్చేశారు. వివరాలు.. పట్టణంలోని సర్వే నంబర్ 681లో పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సుధాకరరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు రాజశేఖరరెడ్డికి చెందినది. అయితే వైఎస్సార్ సీపీ నాయకులకు చెందిన స్థలంలో గతంలో కోనాపురం, మంగాపురం, కొండాపురం గ్రామాలకు చెందిన వారు రోడ్డు కోసం ఫిర్యాదు ఇచ్చారు. రెండు రోజుల క్రితం సర్వే చేసిన అధికారులు ఇది పట్టా భూమి అని, అయితే రికార్డుల్లో 12 అడుగుల రోడ్డు ఉందని నిర్ధారిస్తూ హద్దులు నిర్ణయించారు. అయితే గురువారం ఏకంగా జేసీబీ తీసుకొచ్చి అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మార్కింగ్ ఇచ్చేశారు. సర్వేయర్‌తో పాటు ఆర్ఐ భాస్కరరెడ్డి ఇతర మున్సిపల్ సిబ్బంది ఇష్టారాజ్యంగా రోడ్డుకు మార్కింగ్ ఇవ్వడంతో పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తనిఖీ బృందానికి సహకరించండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు

రొళ్ల: మండలంలో 18వ విడత సామాజిక తనిఖీ బృందం సభ్యులకు రైతులు, కూలీలు సహకరించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బంది, సామాజిక తనిఖీ బృందంతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ 577 పనులకు గాను రూ.4.51 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ఆ నిధులతో చేపట్టిన పనులు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తనిఖీ బృందం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేధికలు తయారు చేయాలన్నారు. అవినీతికి పాల్పడిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ తిరుమలేష్, ఏపీఓ ఓబుళప్ప తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి



రొళ్ల మండలం గుడ్డగుర్కి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్

మడకశిరరూరల్: భూ సమస్యలున్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కరుణాకర్ సూచించారు. హరేసముద్రం గ్రామ సచివాలయంలో గురువారం భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రైతులు రెవెన్యూ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని గుడ్డగుర్కి సచివాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రొళ్ల పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసి మినరల్ ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించి ఓపీ వివరాలను వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 63 అర్జీలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, ఆర్ఐ గిరియప్ప, బ్రహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పాఠశాలల అభివృద్ధి

లేపాక్షి/పరిగి/గుడిబండ/రొళ్ల: లేపాక్షిలోని ఎంఆర్‌సీ కేంద్రంలో గురువారం ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ ఎస్ఎంసీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఎంసీ శిక్షణ పరిశీలకుడు మాస్టర్ ట్రైనర్ పఠాన్‌బాబుఖాన్ , ఎస్ఎంసీ సభ్యులు, ఎంఈఓ-2 కుళ్లాయప్ప, ఆర్పీలు సురేష్ బాబు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని విద్యా సంస్థల యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒక్క రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, డీఆర్పీలు రమేష్‌కుమార్, వెంకటేష్, శేఖర్, హెచ్‌ఎం కృపా సత్యరాజ్ పాల్గొన్నారు. గుడిబండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ రవిచంద్రన్ , హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రొళ్ల మండలంలోని దొమ్మరహట్టి గ్రామ సమీపాన అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత హెచ్‌ఎంలతో పాటు స్కూల్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ శ్రీధర్ , ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిరక్షించండి



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పావగడ: నాగలమడక గ్రామంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే అంత్య సుబ్రహ్మణ్యం స్వామి బ్రహ్మ రథోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను స్థానిక ఎండోమెంట్ అధికారి తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరాం గురువారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత కాపాడాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. సమీపంలోని ఉత్తర పినాకిని నదిలో అధికంగా నీరు ఉండడంతో.. నది వద్దకు భక్తులు వెళ్లకుండా ముందుజాగ్రత్తలు చేపట్టాలని తిరుమణి పోలీసులకు సూచించారు. అనారోగ్యం పాలైన భక్తులకు వెంటనే చికిత్స అందించే దిశగా ఆరోగ్య శిబిరంలోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పీడీఓ హనుమంతరాయప్ప, ఆర్ఐ కేవీ నారాయణ, గ్రామ పాలనాధికారి మధు కుమార్, రవి కుమార్,ఉమాశంకర్ తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



రైతులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని మాజీ మంత్రి ఉష శ్రీ చరణ్ తెలిపారు. గురువారం మండలంలోని రంగేపల్లి, మాగేచెరువు గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇస్తామని గద్దెనెక్కిన చంద్రబాబు..తీరా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా రూ.13,500 సమయానికి ఇవ్వడంతో పంటలు సాగు కోసం రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. గ్రామ స్థాయిలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, కరువు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పాడి పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి రైతులు నష్టాల పాలవుతున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే రైతుల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడిపేసిందన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం అంటున్నారని ఈ పథకాన్ని నీరు గార్చడానికే వాయిదాలు వేస్తున్నారని తెలిపారు. విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపుతోందన్నారని ఇలాంటి అసమర్థ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమాకాంత్ రెడ్డి, ఎంపీటీసీలు నాగప్ప, స్థానిక నయాకులు డాక్టర్ బాబు, నరసింహమూర్తి, మురళి, బాలాజీ, నాగరాజు, అంజి, సంజీవ నరసింహులు పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ రంగేపల్లి

సోమందేపల్లి: మండలంలోని రంగేపల్లిలో గురువారం ఉదయం గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ నిర్వహించారు. గ్రామంలో ఆమె కలియ తిరిగారు. రైతులు, కార్మికులు, కూలీలతో కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చిందా ? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లు గజేంద శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, సీనియర్ నాయకులు రమాకాంత్ రెడ్డి, ఎంపీటీసీ నాగప్ప, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బాలు, నరసింహ మూర్తి, డాక్టర్ బాబు, మురళి, సంజీవ, నరసింహులు, ఎర్ర అంజి, నాగరాజు, ఆది తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో కలిసి గ్రామంలో టీ తాగుతున్న దృశ్యం

పార్టీని బలోపేతం చేయాలి



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: నియోజకవర్గంలో అందరూ కలిసికట్టుగా ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారని మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు. గురువారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని వేర్వేరుగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

పెనుకొండ/సోమందేపల్లి/మడకశిర/రొళ్ల: పెనుకొండ పట్టణంలోని బార్ అసోసియషన్ కార్యాలయంలో గురువారం ఏజీపీ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. అలాగే సోమందేపల్లిలోని ఎమ్మార్సీలో యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లు, పదోతరగతి మోడల్ పరీక్ష పేపర్లను గురువారం ఆవిష్కరించారు. అదేవిధంగా మడకశిర పట్టణంలోని ఎమ్మార్సీలో ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి, చంద్రశేఖర్‌నాయుడు ఆవిష్కరించారు. రొళ్ల మండలంలోని దొమ్మరహట్టి గ్రామ సమీపాన ఉన్న అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో 2025 డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లకు ఎంఈఓ శ్రీధర్ విడుదల చేశారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ

మడకశిర: మడకశిర డిపోలో పని చేస్తున్న పలువురు డ్రైవర్లకు గురువారం డీఎం రామసుబ్బయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకంగా ఓ బస్సు ఏర్పాటు చేశారు. డ్రైవింగ్‌లో పాటించాల్సిన మెలకువలను నేర్పించారు. అదే విధంగా డీజల్‌ను ఎలా ఆదా చేయాలో సూచించారు. ప్రమాదాలు జరగకుండా బస్సులను ఎలా నడపాలో అనే అంశంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ బస్సుల ప్రారంభం

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు మడకశిర డిపోనకు మంజూరైన నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభిస్తారని డీఎం రామసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అదే విధంగా మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ప్రిన్సిపాళ్లు సుజాత, మహేష్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పరిగి: పంట సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏఓ విజయభారతి తెలిపారు.గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి.నరసాపురం, హొన్నంపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

సోమందేపల్లి: విద్యార్థులు చదువుతోపాటు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని ఎంఈఓ ఆనంద్ బాబు తెలిపారు. గురువారం వెలుగు కార్యాయలంలో మండల వ్యాప్తంగా ఉన్న హెచ్‌ఎంలు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లకు పాఠశాలల నిర్వహణతోపాటు బోధనపై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్లు రామకృష్ణ, అశ్వర్థప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ పేపర్లు

రొద్దం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పదోతరగతి మోడల్ పరీక్ష పేపర్లను మాజీ జెడ్పీటీసీ చిన్నప్పయ్య, విశ్రాంత ఉపాధ్యాయురాలు ఉమాదేవి సౌజన్యంతో, ఈడిగ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. యూటీఎఫ్ అధ్యక్షుడు సానిపల్లి గంగాధర్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి మారుతి, గౌరవ అధ్యక్షుడు రమేష్, శేషాద్రి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి

హిందూపురం: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనాయతుల్లా, అసెంబ్లీ కో–ఆర్డినేటర్ కిఫాయతుల్లా ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

పరిగి: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం అన్నారు. గురువారం మండలంలోని సేవామందిరం ఏఎం లింగణ్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ మండల స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన పలువురు విజేతలు శుక్రవారం జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృపా సత్యరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆందోళనకారుడి ప్రాణాలు కాపాడండి

పావగడ: ఎంఎస్‌పీ అమలు చేయని కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ హర్యాణాలోని శంభు సరిహద్దులో 8 నెలల నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగత్ సింగ్ దలైవాల ఆరోగ్యం క్షీణిస్తోందని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ చట్టాన్ని అమలు చేసి అతని ప్రాణాలు కాపాడాలని స్థానిక జిల్లా కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పుజారప్ప తదితరులు ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులు గురువారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక చర్యలను ధిక్కరిస్తూ ఆందోళన చేపడుతున్న వారి డిమాండ్లు పరిష్కరించాలన్నారు. అనంతరం ఉప తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే పంచాయతీ లక్ష్యం

అమరాపురం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు సర్పంచ్ వాగేష్, కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు వీరాపురంలోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ సర్వే, బాల్య వివాహాలు అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్దేశ్వర, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగం

హిందూపురం: పట్టణంలోని శ్రీనివాస మందిరం వద్ద గురువారం గోవిందమాల ధారులు మూలవిరాట్ వేంకటేశ్వర స్వామికి పుష్పయాగం నిర్వహించారు. మెయిన్ బజారులోని పేట వేంకటరమణ స్వామి ఆలయం వద్ద నుంచి వేంకటేశ్వర స్వామి చిత్రటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి గోవింద వ్రతం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామికి అర్చనలు, పూజలు చేపట్టారు. మంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం గోవింద మాలధారులకు అన్నదానం నిర్వహించారు.

రాగి సాగుతో లాభాలు

లేపాక్షి: రాగి సాగుతో లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయాధికారి శ్రీలత సూచించారు. గురువారం మండల పరిధిలోని చోళసముద్రం, కొండూరు రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాగి పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతు.. ప్రతి రైతు రాగి సాగు చేయాలన్నారు. క్వింటా రాగులకు ప్రభుత్వం రూ.4,290 మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. రాగి సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రాగిని ఆహారంగా తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు వరి నాట్లు త్వరగా వేసుకోవాలని.. ఆలస్యంగా వేస్తే దిగుబడి తగ్గుతుందన్నారు. జింక్ లోపం కూడా ఆశిస్తుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ పుష్పలత, ఆర్ఎస్‌కే సిబ్బంది ముత్యాలప్ప, సుమియాభాను, రైతులు పాల్గొన్నారు.